క్లుప్తంగా

ఎమ్మెల్సీ పరామర్శ



ముత్యాలరావును పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ విక్రాంత్, వైఎస్సార్‌సీపీ నాయకులు

వంగర: మండలంలో సంగాం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత ఉగిరి ముత్యాలరావు సోదరి శీరపు సత్యవతి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ సోమవారం సంగాం గ్రామానికి వెళ్లి ముత్యాలరావును పరామర్శించారు. సత్యవతి మృతికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ ఉత్తరావెల్లి సురేష్‌ముఖర్జీ, వైస్ ఎంపీపీ కిమిడి ఉమామహేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కరణం సుదర్శనరావు, సర్పంచ్‌లు గేదెల వెంకటనాయుడు, పోలిరెడ్డి రమేష్, బూరాడ వెంకటరావు, ఎంపీటీసీ కిమిడి సన్యాసినాయుడు (తాతబాబు), యజ్జల రాము తదితరులున్నారు.

పీహెచ్‌సీ వైద్యులకు మద్దతుగా నిరసన



బొద్దాం పీహెచ్‌సీ వద్ద నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న వైద్య సిబ్బంది

రాజాం: పీహెచ్‌సీల వైద్యులు తమ డిమాండ్ల పరిష్కారం నిమిత్తం చేస్తున్న నిరసన కు పీహెచ్‌సీల సిబ్బంది సంఘీబావం తెలిపారు. మండలంలోని బొద్దాం పీహెచ్‌సీలో పారామిలటరీ వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు సోమవారం నల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. సమ్మెచేస్తున్న వైద్యులకు మద్దతు పలికారు. వారి డిమాండ్లు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. డాక్టర్ మహేష్‌బాబు, సీహెచ్‌ఓ ఉషారాణి, హెచ్.వి.శశికిరణ్‌కుమారి, యూడీసీ గంగారాం, సిబ్బంది పాల్గొన్నారు.

సంగాంలో నగర సంకీర్తన



నగర సంకీర్తన చేస్తున్న హరేకృష్ణ భక్తజన సంఘం

వంగర: మండలంలోని సంగాంలో హరేకృష్ణ భక్తజన సంఘం ఆధ్వర్యంలో సోమవారం నగర సంకీర్తన చేశారు. కార్తీకమాసం ముగిసేవరకు రోజూ గ్రామాల్లో నగర సంకీర్తన, ఆధ్యాత్మిక సమావేశాలు నిర్వహిస్తామని సంఘ సభ్యులు తెలిపారు.

ఘనంగా వారాల పండగ



అమ్మవారి గద్దె వద్ద పూజలు చేస్తున్న గ్రామస్తులు

వంగర: మండల కేంద్రంలో గ్రామదేవత దేశమ్మ తల్లి వారాల పండగను గ్రామస్తులు సోమ వారం ఘనంగా నిర్వహించారు. గ్రామస్తులంతా ఊరేగింపుగా అమ్మవారి గద్దె వద్దకు చేరు కుని ప్రత్యేక పూజలు చేశారు. పసుపు,కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించు కున్నారు. పంటలు బాగా పండేలా చూడు తల్లి అని అమ్మవారిని వేడుకున్నారు.

మత్స్యకార సొసైటీ ఓటర్ల జాబితా ప్రదర్శన



మద్దివలసలో ఓటర్ల జాబితా ప్రదర్శిస్తున్న సిబ్బంది

వంగర: మండల పరిధి కొట్టిశ శ్రీ సీతారామ ఫిషర్ మెన్ సొసైటీ ఎన్నికలకు సంబంధించి ఓటర్ల జాబితాను ఎన్నికల అధికారి సంతోష్ సోమవారం కొట్టిశ, మద్దివలస గ్రామాల్లో ప్రదర్శించారు. మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టులో చేపల వేట సాగించే మత్స్యకారులకు సంబంధించిన ఈ ఎన్నిక నవంబర్ 11న జరగనుందని వెల్లడించారు. ఫిషరీస్ ఇన్‌స్పెక్టర్ ప్రసాదరావు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు

తెర్లాం: ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజలు, రైతులు తమ సమస్యలపై అందించే అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జి.హేమంత్‌కుమార్, ఎంపీడీఓ ఆర్.రాంబాబు తెలిపారు. స్థానిక రెవెన్యూ, మండల పరిషత్ కార్యాలయాల్లో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. భూసమస్యల్య పై తహసీల్దార్‌కు పలు గ్రామాల రైతులు వినతిపత్రాలు అందజేశారు. సుందరాడ గ్రామానికి చెందిన రైతు తన భూములకు సంబంధించి వన్‌బీ వస్తోందని, అడంగల్ రావడం లేదని తహసీల్దార్‌కు తెలియజేశారు. పింఛన్ మంజూరు చేయాలని ఎంపీడీఓకు పలువురు వినతిపత్రాలు అందజేశారు.

నకిలీ మద్యంతో.. ప్రజల ప్రాణాలు బలి



బొబ్బిలిలో ర్యాలీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంబంగి, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు

- నకిలీ మద్యం తయారీ, బెల్టు షాపుల నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నిరసన
- కూటమి నేతల ధన దాహానికి ప్రజలు బలికావాలా..?
- మాజీ ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి:

టీడీపీ నాయకులు ధన దాహంతో నకిలీ మద్యం తయారు చేసి ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని మాజీ ఎమ్మెల్యే శంబంగి వెంకట చిన అప్పలనాయుడు ఆరోపించారు. నారా వారి నకిలీ మద్యం పేరిట అధికార పార్టీ నాయకులు నకిలీ మద్యం తయారీ, అక్రమ వ్యాపారాలు చేస్తుండడాన్ని నిలదీస్తూ వైఎస్సార్‌సీపీ జాతీయ అధ్యక్షుడు వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు సోమవారం నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే శంబంగి ఆధ్వర్యంలో పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ర్యాలీగా ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయా నికి చేరుకుని అక్కడ ధర్నా చేశారు. ప్లకార్డులు చేతపట్టి నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటారా?, మద్యం వ్యాపారాలపై సీబీఐ దర్యాప్తునకు వెంటనే ఆదేశించాలని, ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించాలని నినాదాలు చేశారు. ములకల చెరువులో టీడీపీ నాయకు లు ఫ్యాక్టరీ ఏర్పాటు చేసి అక్కడి నుంచి నకిలీ మద్యాన్ని రాష్ట్ర వ్యాప్తంగా మద్యం దుకాణాలు, బార్లకు సరఫరా చేశారని ఆరోపించారు. నకిలీ మద్యం వ్యాపారాలతో సంబంధం ఉన్న టీడీపీ నాయకులను వెంటనే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు.

బెల్ట్ షాపులను ప్రభుత్వమే ప్రోత్సహిస్తోంది

మాజీ ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ నియోజకవర్గంలో అన్ని చోట్లా బెల్ట్ షాపులున్నాయని, వీటిని ప్రభుత్వమే ప్రోత్సహిస్తోందని ప్రజలు బహిరంగంగా మాట్లాడుకుం టున్నారని అన్నారు. గతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం దుకాణాలు నిర్వహించేదని, నిర్ణీత వేళల్లో మాత్రమే మద్యం విక్రయించినప్పటికీ ఎన్నో విమర్శలు చేసిన టీడీపీ నాయకులు ఇప్పుడు కిమ్మనక పోవడం దారుణమన్నారు. చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ లిక్కర్ వ్యాపారాలను చూసీ చూడనట్టు వదిలేస్తుండడంతో ప్రజలు దోపిడీకి గురవుతున్నారన్నారు.ప్రజలు నకిలీ మద్యంతో ఇళ్లు,ఒళ్లు గుల్ల చేసుకుంటున్నారని అన్నారు. నకిలీ మద్యం గుట్టు తేల్చేందుకు బార్‌లు, వైన్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేయించి, అక్రమార్కులను వెంటనే అరెస్టు చేయాలని కోరారు. అనంతరం ఎక్సైజ్ సీఐ పి.చిన్నం నాయుడుకు వైఎస్సార్‌సీపీ మహిళా నేతల చేతుల మీదుగా వినతిపత్రం అందజేశారు. వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు చోడిగంజి రమేష్ నాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్‌లు ఇంటి గోపాలరావు, ఎస్.వి.మురళీకృష్ణారావు, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శంబంగి వేణు గోపాలనాయుడు, రామభద్రపురం, బొబ్బిలి ఎంపీపీలు చొక్కాపు లక్ష్మణరావు, శంబంగి లక్ష్మి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి బొద్దల సత్యనారాయణ, రేజేటి ఈశ్వరరావు, రామభద్రపురం జెడ్పీటీసీ అప్పికొండ సరస్వతి, మున్సిపల్ మాజీ వైస్ చైర్‌పర్సన్ గొలగాన రమాదేవి, బ్రాహ్మణ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ డబ్ల్యూ.వి.ఎల్.ఎన్.రాయలు ,వివిధ గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నకిలీ మద్యం కేసును సీబీఐకి అప్పగించాలి

- రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్

రాజాం: నకిలీ మద్యం తయారీ కేసును సీబీఐకి అప్పగించాలని రాజాం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ తలే రాజేష్ డిమాండ్ చేశారు. నకిలీ మద్యం తయారీని, బెల్టు షాపుల నిర్వహణను నిరసిస్తూ రాజాం పట్టణంలో వైఎస్సార్‌సీపీ కార్యాలయం నుంచి ప్రధాన రహ దారి మీదుగా శ్రీకాకుళం రోడ్డులో ఉన్న ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ కార్యాలయానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా ప్రతినిధులు, ప్రజలు సోమవారం ర్యాలీగా వెళ్లారు. అక్కడ ధర్నా చేశారు. అనంతరం ఎక్సైజ్ ఎస్ఐ జి.మాన్యాలకు మెమోరాండం అందించారు. ఈ సందర్భంగా రాజేష్‌తో పాటు పలువురు నాయకులు మాట్లాడుతూ టీడీపీ నేతలే నకిలీ మద్యం తయారు చేస్తున్నారని ఆరోపించారు. సంపద సృష్టి అని చెప్పి డంపింగ్ యార్డుల వద్ద నకిలీ మద్యం తయారు చేస్తున్నారని దుయ్యబట్టారు. నకిలీ మద్యం తయారీదారులను అరెస్టు చేయకుంటే పోరాటం ఉధృత్తం చేస్తామని హెచ్చరించారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఒక్క కల్తీ మద్యం కేసు కూడా నమోదు కాలేద ని, ఒక్కరు కూడా మద్యం తాగి చనిపోయిన ఘటనలు లేవని గుర్తుచేశారు.కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత నకిలీ మద్యం, కల్తీ బేవరీస్‌లు పుట్టుకొస్తున్నా యని, రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ కూటమి నేతలు నకిలీ మద్యాన్ని విక్రయించడమే కాకుండా బెల్టుషాపులను ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. ఈ నకిలీ మద్యం వ్యవహారంపై కేంద్ర ప్రభుత్వం సీబీఐ దర్యాప్తు చేపట్టాలని, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సిట్‌పై తమకు నమ్మకం లేదని అన్నారు. మాజీ ఎమ్మెల్యే తలే భద్రయ్య, వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షుడు టంకాల అచ్చెన్నాయుడు, పార్టీ రాజాం పట్టణ, రూరల్ అధ్యక్షులు పాలవలస శ్రీనివాసరావు, లావేటి రాజగోపాలనాయుడు, రేగిడి మండ లం అధ్యక్షుడు వావిలపల్లి జగన్‌మోహనరావు, పార్టీ ఉపాధ్యాయ విభాగం జిల్లా అధ్యక్షుడు మరిశర్ల గంగారావు, వైస్ ఎంపీపీ యాలాల వెంకటేష్, సర్పంచ్ ల విభాగం నియోజకవర్గ కన్వీనర్ వాకముల్లు చిన్నంనాయుడు, ఆర్‌టీఐ విభాగం కన్వీనర్ వంజరాపు విజయ్‌కుమార్, కల్చరల్ విభాగం జిల్లా అధ్యక్షులు డాక్టర్ బి. నరేంద్ర, దూబ గోపాలం, సీనియర్ నాయకులు శాసపు వేణుగోపాలనాయుడు, కె.నారాయణరావు, వ్యవసాయ సలహా మండలి రాజాం మండల మాజీ అధ్యక్ష డు కోనారి అప్పారావు, సర్పంచ్‌లు నక్క శ్రీను, డి. వెంకటరమణ, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, ఎంపీటీసీ మజ్జి శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ బింగి సూర్యనారా యణ, నాయకులు సామంతుల వెంకటప్పలనాయుడు, సలాది సత్తీష్, పి.శ్రీనివాసరావు, కిలారి శ్రీను, కామోదుల శ్రీరంగంనాయుడు, ఇనుమల జనార్ధనరావు, కోల్ల రమ్య, తేజస్విని, తదితరులు పాల్గొన్నారు.



రాజాంలో ర్యాలీ చేస్తున్న తలే రాజేష్, పార్టీ నాయకులు, కార్యకర్తలు

18న చెకుముకి టాలెంట్ టెస్టు



వాల్ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న జేవీవీ నాయకులు

రాజాం సిటీ: జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) ఆధ్వర్యంలో ఈనెల 18న పాఠశాల స్థాయి చెకుముకి టాలెంట్ టెస్టు నిర్వహించనున్నామని జేవీవీ డివిజన్ అధ్యక్షుడు గొర్లె రమేష్ తెలిపారు. సోమవారం స్థానిక ప్రభుత్వ పాఠశాల ఆవరణలో పోటీలకు సంబంధించిన వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చెకుముకి సైన్స్ సంబరాలు జరగనున్నాయని పేర్కొన్నారు. 18న పాఠశాల స్థాయి, నవంబర్ 1న జిల్లా స్థాయిలో ఈ పోటీలు ఉంటాయని చెప్పారు. అలాగే డిసెంబర్ 12, 13, 14వ తేదీల్లో రాష్ట్రస్థాయిలో పోటీలు జరగనున్నాయని పేర్కొన్నారు. జేవీవీ జిల్లా గౌరవాధ్యక్షుడు జె.నీలయ్య, రోటరీక్లబ్ చైర్మన్ గట్టి పాపారావు, రెడ్‌క్రాస్ చైర్మన్ కొత్తా సాయిప్రశాంత్‌కుమార్, యూటీఎఫ్ నాయకులు రెడ్డి మోహనరావు, మానవతా సంస్థ అధ్యక్షుడు బి.వి. అచ్యుత్ కుమార్, పెంకి చైతన్య కుమార్, జేవీవీ సభ్యులు ఆర్నిపల్లి వెంకటనాయుడు, పందూరు వేణుగోపాల్, పెంకి గౌరీశ్వరరావు, బలివాడ నాగేశ్వరరావు, బొల్లా జగదీశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు పొగిరి హైస్కూల్ విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం పద్మావతి, తదితరులు

రాజాం సిటీ: మండలంలోని పొగిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన 16 మంది విద్యార్థులు ఇటీవల నిర్వహించిన జిల్లాస్థాయి స్కూల్‌గేమ్స్ పోటీల్లో వివిధ విభాగాల్లో సత్తా చాటి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని హెచ్ఎం బి.పద్మావతి సోమవారం తెలిపారు. అండర్-14 విభాగం యోగాలో బాలికలకు సంబంధించి పొగిరి హేమని, పొగిరి ధరణి, అండర్- 17 విభాగంలో చూల్ల అపర్ణ, పొగిరి యామిని, అలుగోలు లావణ్య, బాలురకు సంబంధించి నెయిగాపుల హేమంత్‌కుమార్ ఎంపికయ్యారు.అండర్-14లో టేబుల్ టెన్నిస్ పోటీలకు బాలికల విభాగంలో బూరాడ తేజశ్రీ, అండర్-17లో యర్నేన భార్గవి, ముదిలి శాంతిప్రియ, మక్క వైష్ణవి, జద్దు హారిక, అండర్ -14లో బాలురకు సంబంధించి పొగిరి రోహిత్, అండర్-17లో సాసుబిల్లి సతీష్ ఎంపిక కాగా, క్రికెట్‌లో సీనియర్ బాలికల విభాగంలో పలిశెట్టి యోషిని,ఆబోతుల పూజిత, అలాగే డిస్క్‌త్రో విభాగానికి సంబంధించి తోలేటి శిరీష ఎంపికయ్యారని చెప్పారు. వీరిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

రోజూ చెత్త సేకరణ చేపట్టాలి



రాజాం: సోపేరులో చెత్త సేకరణను పరిశీలిస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ శ్రీనివాసరావు

రాజాం: గ్రామాల్లో క్లాప్ మిత్రలు రోజూ ఇంటింటి నుంచి చెత్త సేకరణ చేపట్టాలని డిప్యూటీ ఎంపీడీఓ వి.శ్రీనివాసరావు సూచించారు. సోపేరు గ్రామంలో సోమవారం చేపట్టిన చెత్త సేకరణను పరిశీలించారు.క్లాప్ మిత్రకు పలు సూచనలు చేశారు. పరిసరాల పరిశుభ్రతపై గ్రామ మహిళలకు అవగాహన కల్పించారు. అనంతరం కంచరాం, గడి ముడిదాం, శ్యాంపురం గ్రామాల్లో పర్యటించారు. ఆయా గ్రామ సచివాలయాల్లో తనిఖీలు చేశారు.

పరిశుభ్రత పాటించాలి

వంగర: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఈఓపీఆర్డీ కెల్ల రామారావు అన్నారు. మండలంలోని బాగెంపేటలో క్లాప్ మిత్ర చేపట్టిన ఇంటింటి చెత్త సేకరణను సోమవారం ఆయన పరిశీలించారు. తడి,పొడి చెత్త వేర్వేరుగా క్లాప్ మిత్రకు అందించాలని మహిళలకు సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఇందిర ఉన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు అరకొర సరుకులు



రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-8లో తొమ్మిది మంది లబ్ధిదారులు ఉండగా 5 ప్యాకెట్లే వచ్చిన కందిపప్పు

రామభద్రపురం: అంగన్‌వాడీ కేంద్రాలకు చిన్నారులు, లబ్ధిదారుల సంఖ్యకు సరిపడా పౌష్టికాహార సరుకులు పంపిణీ చేయడంలేదని కేంద్రాల కార్యకర్తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని పలు కేంద్రాలకు సరిపడా కందిపప్పు సరఫరా కాలేదు. రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-2కి గత నెల పూర్తిగా బియ్యం పంపిణీ కాలేదు.అలాగే గర్బిణులు,బాలింతలు 13 మంది ఉండగా కందిపప్పు 10 ప్యాకెట్లు మాత్రమే ఇచ్చారు. రామభద్రపురం అంగన్‌వాడీ కేంద్రం-6 పరిధిలో ఈ నెలలో బాలింతలు,గర్బిణులు ఆరుగురు ఉండగా 4 కంది పప్పు ప్యాకెట్లు అందజేశారు.అలాగే అంగన్‌వాడీ కేంద్రం-8 పరిధిలో ఈ నెలలో గర్బిణులు,బాలింతలు తొమ్మిది మంది ఉండగా కంది పప్పు 5 ప్యాకెట్లే ఇచ్చారు.అంగన్‌వాడీ కేంద్రం-4 పరిధిలో గర్బిణులు,బాలింతలు 11 మంది ఉండగా కంది పప్పు 6 ప్యాకెట్లే సరఫరా చేశారని ఆయా కేంద్రాల కార్యకర్తలు తెలిపారు.గత నెలలో ఇంటి దగ్గర నుంచి బియ్యం తెచ్చి పిల్లలకు వండి పెట్టానని ఓ అంగన్ వాడీ కేంద్రం కార్యకర్త చెప్పారు.లబ్ధిదారులకు సరిపడా పప్పు సరఫరా చేయకపోతే తామెక్కడి నుంచి తెచ్చి ఇవ్వాలని, పై నుంచి సరఫరా కాలేదని లబ్ధిదారులకు చెప్పినా వారు నమ్మరని ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. ఈ విషయాన్ని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సూర్యకుమారి వద్ద సాక్షి ప్రస్తావించగా.. ఆయా కేంద్రాల కార్యకర్తలు బాలసంజీవిని యాప్‌లో వివరాలు నమోదు చేయడం లేదని,పోషణ అభియాన్ యాప్‌లో నమోదు చేస్తే స్టాక్ రావడం లేదని చెప్పారు. బాల సంజీవిని యాప్‌లో నమోదు చేస్తేనే గర్బిణులు,బాలింతలకు సరిపడా సరుకులు వస్తాయని తెలిపారు.

దోమల నివారణకు ఫాగింగ్

రేగిడి: మండలంలోని సంకిలి, బొడ్డవలస, చిన్నయ్యపేట తదితర గ్రామాల్లో దోమల నివారణకు పంచాయతీ కార్యదర్శులు సోమ వారం ఫాగింగ్ చేయించారు. గ్రామాల్లో ఎప్పటికప్పుడు పారిశుద్ధ్య పనులు చేయించాలని, దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు ఎంపీడీఓ శ్యామలాకుమారి సూచించారు.

బాణసంచా విక్రయాల్లో నిబంధనలు పాటించాలి



లైసెన్సు దారులకు సూచనలు చేస్తున్న ఆర్డీఓ రామమోహనరావు

బొబ్బిలి: దీపావళి పండగకు బాణా సంచా విక్రయాల విషయంలో తాత్కాలిక లైసెన్సుదారులు నిబంధనలను పాటించాలని ఆర్డీఓ జె.వి.వి.ఎస్.రామమోహనరావు అన్నారు. బొబ్బిలి మున్సిపాలిటీ పరిధిలో తాత్కాలిక బాణాసంచా దుకాణాలకు సంబంధించి అయిదుగురికి స్థానిక రెవెన్యూ డివిజన్ కార్యాలయంలో సోమవారం లైసెన్సులు మంజూరు చేశారు. ఈసందర్భంగా వారికి పలు సూచనలు చేశారు. విక్రయ స్టాళ్ల వద్ద నిర్ణీత దూరం పాటించాలని, ప్రతీ దుకాణానికి మధ్యలో నాలుగు చక్రాల వాహనాలు సులువుగా తిరిగేలా చూసుకోవాలని చెప్పారు. స్టాళ్ల వద్ద ఇసుక, నీరు సిద్ధం చేయాలని, ప్రమాదాలు జరగకుండా తగు జాగ్రత్తలు పాటించాలని, సీసీ కెమెరాలు ఉండాలన్నారు.

నేడు చల్లపేటలో నేత్ర వైద్య శిబిరం

మెంటాడ: చల్లపేట గ్రామంలో శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించనున్న ట్లు శిబిరం సమన్వయకర్త వెంకటరమణ సోమ వారం ఓ ప్రకటనలో తెలిపారు. గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద నిర్వహించే ఈ శిబిరానికి చల్లపేటతో పాటు సమీప గ్రామాలకు చెందిన కంటి సమస్యలతో బాధపడుతున్న వారు వచ్చి నేత్ర పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని ఎంపిక చేసి, శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో ఉచితంగా శస్త్ర చికిత్సలు చేయిస్తామని పేర్కొన్నారు. శిబిరానికి వచ్చేవారు ఆధార్,ఆరోగ్యశ్రీ కార్డులు తీసుకొని రావాలని సూచించారు.

శివదీక్షలు ప్రారంభం

బొబ్బిలి: స్థానిక పూల్‌బాగ్‌లోని శివ సన్నిధానంలో సోమవారం శివదీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. గురుస్వాములు కర్రోతు రాములప్పన్న, బొత్స అప్పారావు సుమారు వంద మందికి మాలధారణ చేశారు. అంతకుముందు ప్రత్యేక పూజలు చేశారు.



భక్తులకు మాలధారణ చేస్తున్న గురుస్వాములు

సత్తాచాటిన కంచరాం హైస్కూల్ విద్యార్థులు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం వసంతకుమార్, ఉపాధ్యాయులు

రాజాం: రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ పోటీలకు మండలంలోని ఉన్నత పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు వివిధ క్రీడల్లో ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం వి.వి.వసంతకుమార్, పీడీ టి. దుర్గయ్య సోమవారం తెలిపారు. ఈనెల 6 నుంచి 8 వరకు శ్రీకాకుళంలో జరిగిన జిల్లా స్థాయి స్కూల్ గేమ్స్ పోటీల్లో పాఠశాలకు చెందిన పలువురు విద్యార్థులు అండర్ -14, అండర్-17, అండర్-19 విభాగాల్లో పాల్గొని సత్తాచాటారని చెప్పారు. అండర్ -14 రెజ్లింగ్‌లో వై. ద్రాక్షాయిని, పి.సంజన, కె.హారిక, ఎస్.అపర్ణ, కె.కృపారాణి, పి.పూజిత, పి.నాని ఎంపికయ్యారని వెల్లడించారు. అండర్-17 రెజ్లింగ్‌లో ఏ.సంతోషిణి, పి.సత్యవతి, కె.చంద్రశేఖర్, పి.హేమంత్‌కుమార్ ఎంపిక కాగా, అండర్-19 అథ్లెటిక్స్‌లో పి.రామలక్ష్మి, ఎస్.అన్నపూర్ణ, చెస్ పోటీలకు పి.పావని ఎంపికయ్యారు. అండర్-14 స్విమ్మింగ్ విభాగంలో ఆర్. దుర్గాప్రసాద్, అండర్ -17 విభాగంలో జి.ప్రదీప్, ఏ.సంతోషిణి, అండర్-19 విభాగంలో వై.లక్ష్మణరావు ఎంపికయ్యారని పేర్కొన్నారు. వీరు త్వరలో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని వెల్లడించారు. వీరిని హెచ్‌ఎంతో పాటు పీడీ దుర్గయ్య, పీఈటీ బి. నారాయణనాయుడుఉపాధ్యాయులు అభినందించారు.

పాలిథిన్‌తో పర్యావరణానికి ముప్పు



గుడ్డసంచుల పంపిణీలో మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, తదితరులు

రాజాం సిటీ: పాలిథిన్ సంచుల వల్ల పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని, ప్రతి ఒక్కరూ పాలథిన్ సంచులకు బదులు గుడ్డ సంచులను వినియోగించాలని రాజాం మున్సిపల్ కమిషనర్ కె.శ్రీనివాసరావు అన్నారు.మున్సిపాలిటీ పరిధి బుచ్చెంపేటలో వికాసతరంగిణి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటికీ గుడ్డ సంచులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ అతిగా వినియోగించడం వల్ల వాతావరణంలో పెనుమార్పులు చోటుచేసుకుంటున్నాయని అన్నారు. ప్రజల సహకారంతోనే వాటిని నివారణ సాధ్యమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సరుకుల కొనుగోలుకు ఇంటి వద్ద నుంచే గుడ్డ సంచులను తీసుకువెళ్లాలని సూచించారు. అనంతరం ప్లాస్టిక్ వద్దు..గుడ్డసంచులే ముద్దు అంటూ నినాదాలు చేశారు. సారథి విజయకోదండరామ ఆశ్రమ అధ్యక్షుడు టి.టి.వి.రమణమూర్తి, వికాసతరంగిణి అధ్యక్షుడు వాకచర్ల పైడిరాజు, డొంక త్రినాథులు, మహంతి సత్యనారాయణ, పెంకి చైతన్యకుమార్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లతో వీఓఏ తొలగింపు అన్యాయం



వెలుగు కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న పొదుపుసంఘాల సభ్యులు, సీఐటీయూ నాయకులు

బొబ్బిలిరూరల్: డ్వాక్రా సంఘాల రికార్డుల నిర్వహణ, లావాదేవీల అంశంలో ఏ తప్పూ చేయకపోయినప్పటికీ, నోటీసుకూడా ఇవ్వకుండా పారాది గ్రామ వీఓఏగా పని చేసిన ఉత్తరావల్లి ఉమావెంకటేశ్వరిని టీడీపీ నాయకుల ఒత్తిళ్ల మేరకు అధికారులు విధుల నుంచి తొలగించడం అన్యాయమని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు పి.శంకరరావు, ఎస్.గోపాలం అన్నారు. బాధితురాలితో పాటు పొదుపు సంఘాల మహిళలతో కలిసి మండల కేంద్రంలోని వెలుగు కార్యాలయం వద్ద సోమవారం ఆందోళన చేపట్టారు. ఈసందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ రాజకీయ కక్షతో వీఓఏను తొలగించడం నీచమైన చర్య అని అన్నారు. చిరుద్యోగులతో రాజకీయాలు మానుకోవాని టీడీపీ నాయకులకు సూచించారు పలువురు మహిళలు మాట్లాడుతూ గ్రామంలో 58 సంఘాల ఆర్థిక లావాదేవీలు చూసిన వీఓఏ ఉమావెంకటేశ్వరిపై ఎలాంటి ఆరోణలు లేకపోయినప్పటికీ విధుల నుంచి తొలగించడం సరికాదన్నారు. వీఓఏలు ఎవ్వరినీ తొలగించడం లేదని ఇటీవల రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తమకు హామీ ఇచ్చారని, ఇంతలోనే టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెచ్చి ఉమావెంకటేశ్వరిని తొలగించి, ఆస్థానంలో టీడీపీ సానుభూతి పరురాలిని నియమించుకున్నారని ఆరోపించారు. గ్రామసభ నిర్వహించి ఉమావెంకటేశ్వరినే వీఓఏగా కొనసాగించాలని పొదుపు సంఘాల సభ్యులమంతా తీర్మానం చేసి డీఆర్‌డీఏ పీడీకి పంపించామని, అయినా అధికారపార్టీ నాయకులు రాజకీయ దురుద్దేశంతో ఉమావెంకటేశ్వరిని విధుల నుంచి తొలగించేలా చేశారన్నారు. ఉమావెంకటేశ్వరిని తిరిగి విధుల్లోకి తీసుకోవాలని నినాదాలు చేశారు.అనంతరం వెలుగు ఏపీఎం భాగ్యలక్ష్మికి వినతిపత్రం అందజేశారు.

అన్నదానం

రాజాం: పట్టణంలోని ఎస్సీ, ఎస్టీ వార్డులో గౌరమ్మ, నందమ్మ ఉత్సవాల నిర్వాహకులు సోమవారం అన్నదానం చేశారు. రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాలవలస శ్రీనివాసరావు నందన్నను దర్శించుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.



రాజాం: భక్తులకు అన్నప్రసాదం వడ్డిస్తున్న రాజాం పట్టణ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు శ్రీనివాసరావు

శ్రీహరిపురంలో..

వంగర: మండలంలోని శ్రీహరిపురం ఆర్అండ్ఆర్ కాలనీలో కొండసూరమ్మతల్లి ఆలయ ప్రతిష్ఠోత్సవంలో భాగంగా సోమవారం అన్నదానం నిర్వహించారు. జెడ్పీటీసీ కరణం రాధమ్మ, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కరణం సుదర్శన రావు, సర్పంచ్ శనపతి సత్యారావు పాల్గొన్నారు.



వంగర: శ్రీహరిపురంలో అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు